# ఒక మరణం- ఒక చావు

డి. వెంకట్రామయ్య

మంత్రిగారి బామ్మగారు మరణించారు. సరిగ్గా రాత్రి తొమ్మిదిన్నరకి ఇహలోక యాత్ర చాలించి పరలోకానికి ప్రయాణం కట్టారు. సమయానికి మంత్రిగారు ఊళ్లోలేరు.

తమ బామ్మగారికి రోజులు దగ్గరకొచ్చాయని తెలుసుకున్న వారైనప్పటికిన్నూ, ప్రజాసేవయే పరమ ధర్మంగా యెంచుకున్న వారు గనక ఆ రోజు ఉదయమే ఊరికెళ్లారు.

అక్కడికి యాభైమైళ్ల దూరానవున్న ఒకానొక పట్టణంలో ఆస్పత్రి కట్టాల్సిన స్థలంలో ఆస్పత్రి కట్టనివ్వకుండా ప్రజలకి ఇతోధికమైన సేవ చేసే సదుద్దేశ్యంతో ఎయిర్ కండిషన్డ్ మరియు బార్ ఎటాచ్డ్ హోటల్ నిర్మించాడొక పుణ్యాత్ముడు. ఆ పుణ్యాత్ముడు మరెవరో కాదు ఒక మంత్రిగారి మేనమామ కొడుకేనంటుంటారు కొందరు పాపాత్ములు. ఆ విషయం మనకప్రస్తుతం. సరే సదరు హోటేలుకి ప్రారంభోత్సవం చెయ్యవలసిందని మన మంత్రిగారిని కోరిన వెంటనే దయతో అంగీకరించి అతి ముఖ్యమైన రాచకార్యాలన్నీ పక్కకుపెట్టి మరణశయ్య మీదనున్న బామ్మగారిని కూడా విడిచిపెట్టి పొద్దున్నే బయలుదేరి అక్కడికెళ్లిపోయారు.

మంత్రిగారి బామ్మగారి వయసు తొంభై నాలుగు సంవత్సరాలు. అంత పిన్న వయసులోనే ఆమె అకాల మరణం చెందినందుగ్గాను మంత్రిగారి బంధుమిత్రులు, అనుచరులూ, సహచరులూ ఇంకా చాలామంది మంత్రిగారొచ్చాక ఏడవొచ్చులే, ఇప్పట్నుంచి ఎందుకు వేస్టని అతి కష్టమ్మీద ఏడుపు ఆపుక్కూర్చున్నారు.

మంత్రిగారికి అరడజను ట్రంక్‌కాల్స్, డజను టెలిగ్రామ్సూ వెళ్లాయి. పుర ప్రముఖులు కొందరు కార్లు పంపారు. కొందరు స్వయంగా మంత్రిగారికి ఎదురువెళ్లారు.

ఇతర మంత్రుల ఇళ్లకీ, ముఖ్యమంత్రిగారింటికీ, గవర్నర్ గారింటికి, శాసన సభ్యుల ఇళ్లకీ, న్యాయమూర్తుల ఇళ్లకి ఉన్నతాధికారుల ఇళ్లకి, పురప్రముఖుల ఇళ్లకి వర్తమానాలు వెళ్లాయి. అంతా హడావుడిగా బయలుదేరి వచ్చేసారు. కొందరు పెద్దలు మటుకు మంత్రిగారొచ్చాక కబురు చెయ్యమన్నారు.

జనం విపరీతంగా వచ్చారు. పత్రికా విలేకరులు వచ్చారు. ఫోటోగ్రాఫర్లొచ్చారు. పోలీసువాళ్లొచ్చారు. సినిమా స్టార్లొచ్చారు. మంత్రిగారి ఇల్లు కిటకిటలాడిపోయింది.

కొందరు కాలుగాలిన పిల్లుల్లా, నిప్పుతొక్కిన కోతుల్లా

ఇంట్లోంటి బయటకి బయటనుంచి ఇంట్లోకి పరుగులెత్తుతున్నారు. ఒక్కొక్కరుగా వచ్చేస్తున్న పెద్దలకి స్వాగతాలు చెప్పి లోపలికి తీసుకువెళ్తున్నారు. కొందరు వచ్చిన పెద్దలచుట్టూ చేరుతున్నారు. మరికొందరు మంత్రిగారి బామ్మగారి జీవిత విశేషాలు చెప్పుకుని విచారిస్తున్నారు. కొందరు శవానికి సేవలు చేస్తున్నారు. ఈగలు, దోమలు రాకుండా విసనకర్రలు పుచ్చుకు విసురుతున్నారు. కంపు కొట్టకుండా పన్నీరు చల్లుతున్నారు. అగరవత్తులు వెలిగిస్తున్నారు. కొందరు మంత్రిగారి సతీమణికి, పిల్లలకి విసురుతున్నారు. ఫాన్ గాలికి ఉక్కిరిబిక్కిరైపోతారని విసనకర్రలు పుచ్చుకుని అతి జాగ్రత్తగా అతి మెల్లగా విసురుతున్నారు. కొందరు కళ్లు తుడుచుకుంటున్నారు. కొందరు ముక్కులు చీదుతున్నారు. ఓదార్చుదామంటే మంత్రిగారి సతీమణిగానీ, పిల్లలుగానీ ఏడవడంలేదు. తలో కుర్చీలో సీరియస్‌గా కూర్చున్నారు.

అర్ధరాత్రి పన్నెండున్నరకి ముందు నాలుగుకార్లు వెనుక నాలుగు కార్లు తోడురాగా మధ్యనున్న కారులో మంత్రిగారు వచ్చేసారు. కారు తలుపు స్వంత చేతుల్తో తెరిచే సౌభాగ్యం కోసమూ, మంత్రిగారికి మొట్టమొదట సానుభూతి తెలియపర్చే మహదవకాశం కోసమూ చాలామంది కారుమీదికెగబడ్డారు. లోపలున్న వాళ్లు కూడా పరుగెత్తుకొచ్చి కారు చుట్టూ మూగారు. పోలీసులు జోక్యం చేసుకుంటేగానీ మంత్రిగారు లోపలికెళ్లడానికి వీలైంది కాదు.

మంత్రిగారు ఇంట్లోకి రాగానే చాలామంది ఏడవడం మొదలుపెట్టారు. మంత్రిగారు మౌనంగా వెళ్లి బామ్మగారి శవం పక్కన కూర్చున్నారు. ఉలకలేదు, పలకలేదు. పరమ సీరియస్‌గా శవాన్ని చూస్తూ కూర్చున్నారు. ఆయనా ఏడవకపోయేసరికి ఓదార్చుదామని కూర్చున్నవాళ్లకి మరోసారి ఆశాభంగం కలిగింది.

పెద్దలొక్కరొక్కరు మంత్రిగారి దగ్గరకొచ్చి తమ తీవ్ర సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరచి సెలవు తీసుకువెళ్లిపోయారు. ఆ తర్వాత మంత్రిగారు తమ అంతరంగికులైనవారితో కొద్దిసేపు ముచ్చటించి రేపటి అంత్యక్రియల ఏర్పాట్ల గురించి ఆదేశాలిచ్చి మేడమీదకెళ్లి పోయారు.

సరిగ్గా అదే సమయాన మంత్రిగారింటికి రెండు ఫర్లాంగుల దూరాన ఒక గుడిసెలో-

కిరసనాయిల్ దీపపు గుడ్డి వెలుగులో దిక్కూ మొక్కూ డబ్బూ దస్కం ఏమీలేని అభాగ్యుడొకడు అనామకుడొకడు పాతికేళ్ల భార్య శవాన్ని ముందెట్టుకు్కూచున్నాడు.

అతని భార్యకి తిండిలేక రోగమొచ్చింది. డబ్బు లేక చచ్చిపోయింది.

వారంరోజులు నరకయాతన అనుభవించి అంతకి గంట క్రితమే కన్ను మూసింది.

★ ★ ★

మంత్రిగారితోపాటు ఇతర పెద్దలు కూడా కార్లు దిగి చితివరకు నడిచారు. మిగతా జనాన్ని కాస్త ఎడంగానే పోలీసులాపేశారు. దహనకాండ ప్రారంభమయ్యేముందు మంత్రిగారి కుడిభుజ మొకాయన కాస్సేపు ఉపన్యసించారు. బామ్మగారు గుణగణాల్ని ప్రశంసించి ఆవిడ మరణం రాష్ట్రానికేకాక యావద్భారత దేశానికి మళ్లీ మాట్లాడితే యావత్ప్రపంచానికీ ఎంత నష్టమో వివరించాడు.

తనకీ అవకాశం కలిగించినందుకు బామ్మగారికి కృతజ్ఞతలు చెప్పుకుని ఉపన్యాసం విరమించాడు. మంత్రిగారి యెడం భుజం కూడా మాట్లాడదామనుకున్నాడుగానీ మంత్రిగారే వద్దని వారించారు.

బామ్మగారి మరణానికి దేవతలు కన్నీరు కారుస్తున్నట్లుగా సన్నగా చినుకు ప్రారంభమైంది.

చితిమీద శవాన్ని పడుకోబెట్టారు. జరగవలసిన తతంగమంతా జరిగాక చితిమీద నెయ్యి కుమ్మరించి

చినుకు కాస్త పెద్దదైంది.
అంటుకున్న నిప్పు ఆరిపోయింది.
ఇంకేం చేయలేక చతికిలబడ్డాడు
అనామకుడు. వాళ్లదగ్గరా వీళ్ల దగ్గరా
అడుక్కున్న పైసలు కాటి సుంకానికే
సరిపోయాయి. కట్టెలు కొనడానికి
మిగల్లేదు. తలెత్తి నల్దిక్కులా
చూశాడు. ఆ మూల మంత్రిగారి
బామ్మగారి చితి ఇంకా
దివిటీ వెలిగినట్టు
వెలుగుతూనే వుంది.



నిప్పంటించారు మంత్రిగారు. భగ్గున నిలువెత్తున మంటలు లేచాయి.

సరిగ్గా అదే సమయాన అదే శ్మశానంలో మరో మూల ఆ పుల్లా ఈ పుల్లా ఏరుకుని చెత్తాచెదారం పోగుచేసి భార్య శవాన్ని దహనం చేయడానికి నానాతిప్పలు పడుతున్నాడు అనామకుడు.

చినుకు కాస్త పెద్దదైంది. అంటుకున్న నిప్పు ఆరిపోయింది. ఇంకేం చేయలేక చతికిలబడ్డాడు అనామకుడు. వాళ్లదగ్గరా వీళ్ల దగ్గరా అడుక్కున్న పైసలు కాటి సుంకానికే సరిపోయాయి. కట్టెలు కొనడానికి మిగల్లేదు.

తలెత్తి నల్దిక్కులా చూశాడు. ఆ మూల మంత్రిగారి బామ్మగారి చితి ఇంకా దివిటీ వెలిగినట్టు వెలుగుతూనే వుంది.

ఉన్నట్టుండి ఆకాశంలో నలువైపులా కారు మబ్బులు కమ్ముకొచ్చాయి. మంత్రిగారు బామ్మగారి అంత్యక్రియలు చూడ్డానికొచ్చిన జనమంతా వెళ్లిపోయారు. బామ్మగారి భౌతికకాయం దాదాపు బూడిదైంది. బూడిదయ్యేదాకా వుంటావున్న వాళ్లిద్దరూ కాస్త వెచ్చగా తాగివద్దామని ఎక్కడికో వెళ్లిపోయారు. శ్మశానంలో ఒక్క పురుగు మిగల్లేదు అనామకుడు తప్ప.

అంతా వెళ్లిపోయాక అనామకుడు మెల్లగా లేచి భార్య శవం భుజాన వేసుకుని బామ్మగారి చితి దగ్గరకొచ్చాడు. శవాన్ని కిందకి దింపాడు. ఒక్క నిముషం ఆలోచించాడు. ఆలోచించే వ్యవధిలేదు. పెద్ద వర్షం వచ్చేట్టుగా వుంది. వేరే చితి తయారుచేసి అంటించాలంటే కష్టం ఈలోగా యెవరైనా రావచ్చు. అందుకే వెంటనే తన కర్తవ్యం నిర్ణయించుకున్నాడు.

విడిగా పడివున్న కట్టెలు కొన్ని తీసి చితిలో వేసాడు. భార్యశవాన్ని చితిమీద వుంచి మరికొన్ని కట్టెలువేసాడు. మంటలు మళ్లీ నిలువెత్తున లేచాయి.

కొద్దిరోజుల తరువాత మంత్రిగారి బామ్మగారి చితాభస్మాన్ని నగరానికి సమీపాన వున్న నదిలో కలపడం కోసం పెద్దఎత్తున ఏర్పాటైన కార్యక్రమంలో అనామకుడు కూడా ఆనందంగా పాల్గొన్నాడు.

★★